
# అసలు కంటే వడ్డీ ముద్దు

- పి.వి.రమణకుమార్



ఆమె నవ్వింది.

అతను నవ్వలేదు.

ఆమె రొమాంటిగ్గా చూసింది.

అతను విసుగ్గా చూశాడు.

"మీకసలు సెన్స్ లేదు..." లో గొంతుకతో అన్నది.

"నిజంగానే లేదు. ఉంటే ఇంత ఖర్చుపెట్టి ఈ హోటల్లో డిన్నర్‌కు రావడమేమిటి?" అతని మాటల్లో బాధ.

"ఇష్... ఇక్కడికొచ్చాక... డిన్నర్ తీసుకునేటప్పుడు కూడా నీరసం వచ్చే మాటలేనా? పిసినారి... మనిషి... విసుగ్గా అనేసింది. ఈమధ్య ఎలా అనిపిస్తే అలా అనేస్తున్నది హరిప్రియ.

రాంసుందర్‌తో పెళ్ళయ్యి రెండేళ్ళు. ఐదేళ్ళవరకూ పిల్లలు వద్దనుకుని ఆ జాగ్రత్తలు తీసుకుంటున్నారు. హరిప్రియ భర్త రాంసుందర్ 'రాముడు మంచి బాలుడు'లాంటివాడే. సుందరమైన పర్సనాలిటీ గల వాడే. ఎటొచ్చీ డబ్బు ఖర్చుచేయడం అంటే మాత్రం గింజుకుంటాడు. బాధపడిపోతాడు. ఆపైన ముఖం మాడ్చేసుకుని మూడ్రోజుల దాకా మాట్లాడడు.

పెళ్ళయిన కొత్తలో ఖంగారుపడిపోయింది. మారతాడులే అనుకుంది. నచ్చచెప్పాలని ప్రయత్నించింది. 'ప్చ్'లాభం లేదు. హరిప్రియ ప్రయత్నాలేవీ ఫలించలేదు. రాంసుందర్‌లో మార్పు తేవడం దున్నపోతుకు ఇంగ్లీషు నేర్పించడం లాంటిదని నిర్ధారణకు వచ్చేసింది.

ఎటో చూస్తున్న భర్త వాలకం చూస్తుంటే మరింత చిర్రెత్తుకొచ్చింది. "భోంచెయ్యండి..."అన్నది హరిప్రియ. అది కాస్ట్‌లీ హోటల్. అక్కడ వడ్డించే భోజన పదార్థాలన్నీ ఖరీదెక్కువే. అంతకు ముందెప్పుడు రాంసుందర్ ఆ హోటల్‌కి రాలేదు. ఈరోజు భార్య బలవంతంమీద వచ్చాడు. వచ్చాక తెలిసింది. అక్కడ డిన్నర్ చేస్తే బిల్ బాగానే పడుతుందని అప్పట్నుంచీ ముభావంగా ఉండిపోయాడు.

"తింటారా! లేక నేనూ మానుకోమంటారా?" సీరియస్‌గా అడిగింది. ఆ మాటలకు ఉలిక్కిపడి "డబ్బులు వేస్ట్. తిందాం. అయినా ఇంత ఖరీదైన హోటల్‌కి రాకపోయుంటే బాగుండేది" చెప్పాడు.

'రోజూ వస్తామా! ఈరోజు మీ బర్త్‌డే." చెప్పింది.

"ఇప్పటికి ఇరవైఏడు బర్త్‌డేలు వచ్చాయి. ఇంత ఖర్చు ఎప్పుడూ పెట్టలేదు."

"మరీ అంత ఇదైపోతారేం? ఫైనాన్స్ చేస్తూ సంపాదిస్తున్నారుగా! వడ్డీలకువడ్డీలు వస్తూనే ఉన్నాయి."

"నీకో విషయం చెప్పనా! వడ్డీ వ్యాపారంచేసి సంపాదించే వాడెవ్వడూ తృప్తిగా తినలేడు." చెప్పాడు రాంసుందర్.

"ఈమాట మాత్రం కరెక్ట్! అందుకే ఆ వ్యాపారం వదిలేసి ఎంచక్కా వేరే ఏదైనా బిజినెస్ చేయండి అని చెబుతూనే ఉన్నాను." పాత పాట ప్రారంభించింది హరిప్రియ.

"వడ్డీ వ్యాపారంలో క్లిక్ అయ్యాక అది వదిలేసేంత పిచ్చివాడీ ప్రపంచంలో ఎవడూ ఉండడు. వచ్చిన వడ్డీ డబ్బుల్ని ఇలా డిన్నర్‌లకు తగలెయ్యకుండా మళ్ళీ...మళ్ళీ వడ్డీలకిస్తే!

బోలెడు లాభాలు..." చెప్పాడు రాంసుందర్.

"తప్పయిపోయింది మహానుభావా! ఇంకెప్పుడూ ఇలా డిన్నర్‌లూ, పార్టీలంటూ బలవంతం చేయను...". చెంపలేసుకుంది భర్త మనస్తత్వం తెలిసిన హరిప్రియ."

చిర... చిర లాడుతూన్న ఆమెను చూస్తూ 'కోపంలో కూడా భలే అందంగా ఉంటుంది' అనుకున్నాడు రాంసుందర్.

❖ ❖ ❖

మగవాళ్ళలో రెండురకాల వాళ్ళుంటారు.

ఆడవాళ్ళను లొంగదీసుకునేవారు.

ఆడవాళ్ళకు లొంగిపోయేవారు.

హరిప్రియ ఇప్పటివరకూ భర్తకు లొంగిపోయిన భార్యగానే వుంది. కానీ! ఇకపై 'భర్తను లొంగదీసుకున్న భార్యగా మారిపోవాలని' గట్టిగా నిర్ణయించుకుంది.

ఆ రాత్రి పింక్ కలర్ నైటీ వేసుకుని బెడ్‌మీద వాలిపోయింది. ఆ బెడ్ రూమ్ అంతా గులాబీ రంగు గోడలతో... గులాబీ రంగు ఇంటీరియర్ డెకరేషన్స్‌తో గులాబీ పూవులా వుంది.

రాంసుందర్‌కు గులాబీ రంగంటే చెప్పలేనంత ఇష్టం. ఆ 'ఇష్టం' తెలిశాక తన శారీస్ అన్నీ దాదాపు గులాబీ రంగువే సెలెక్ట్ చేసుకుంది.

మత్తుగొలిపే మల్లెపూలు పెట్టుకోవాల్సిన తలలో గులాబీలు పెట్టుకోవడం అలవాటు చేసుకుంది. అందుకోసమై ఇంటిముందు కొద్దిగా ఉన్న ఖాళీ స్థలంలో కుండీలు పెట్టి అన్నీ గులాబీ మొక్కలకే ప్రాధాన్యమిచ్చింది.

యథాలాపంగా తన రోజువారీ ఫైనాన్స్ లెఖ్ఖ పని ఒకసారి చూసుకుని ఆ బుక్స్ టేబుల్ సొరుగులో వుంచి, బెడ్‌రూమ్‌లోకి వచ్చాడు రాంసుందర్.

బెడ్‌మీద అటువైపు తిరిగి పడుకుని వున్న హరిప్రియ దగ్గరకు మెల్లగా చేరి తల్లో గులాబీలను వాసన చూశాడు. అతని స్పర్శ తెలుస్తూనే వుంది. అతని శరీరం తన శరీరాన్ని అయస్కాంతంలా లాగేస్తునే వుంది. అయినా చలనం లేని జడ పదార్థంలా అటువేపు తిరిగి, అలాగే పడుకుండిపోయింది.

ఆమె పొడవైన జడ బుసలుకొడుతూన్న నాగినిలా నడుము ఒంపులోంచి వచ్చి పిరుదులుదాకా సాగిపోయింది.

చెవి దగ్గర చేరి "ప్రియా..."అన్నాడు. ఉక్కిరిబిక్కిరైపోయింది. అయినా నిగ్రహించుకుని అలాగే వుండిపోయింది.

"మరీ ఇంతగా... బ్రతిమాలించుకోవాలా?" అడిగాడు. ఒక్కసారిగా ఆమెలో చలనం వచ్చింది. చివ్వున లేచి వెళ్ళి ఓ బెడ్‌షీట్, దిండూ... కింద వేసుకుని విసురుగా పడుకుండిపోయింది.

షాక్ తిన్న వాడిలా బెదిరిపోయాడు. అతనికి ఏం చెయ్యాలో పాలుపోలేదు. ఆమెనెలా బ్రతిమాలి దారికి తెచ్చుకోవాలో అర్థంకాలేదు.

తన తండ్రి దగ్గరినుండి వారసత్వంగా వచ్చిన వడ్డీ వ్యాపారం చేస్తున్నాడే కానీ! భార్యకు ఈ వ్యాపారమంటే ఇంతటి వ్యతిరేకత ఉంటుందని ఎక్కువగా ఆలోచించలేకపోయాడు.

మరీ భయంకరమైన వడ్డీలేమీ వసూలుచేయడు. చిన్నప్పటినుండీ డబ్బు విషయంలో జాగ్రత్తగా ఉంటాడు. ఆచితూచి ఖర్చుపెడతాడు. జీవితంలో మొదటిసారి తీవ్రమైన ఆలోచనలో పడిపోయాడు ఆ రాత్రి రాంసుందర్.

❖ ❖ ❖

మర్నాడునుండీ ఇద్దరిమధ్యా నిశ్శబ్ద యుద్ధం ప్రారంభమైంది. 'తానే పలకరిస్తుందిలే అని అతను. అతనే మాట్లాడకపోతాడా!'అని ఆమె ఎవరికివారు పట్టుదలగా ఉన్నారు.

ఉదయాన్నే కూరగాయలు బుట్టలో పెట్టుకుని ఇల్లిల్లూ తిరుగుతూ అమ్ముకునే ధనలక్ష్మి వచ్చింది. చాలా నీరసంగా.. అనాసక్తిగా ఇంట్లోంచి వస్తున్న హరిప్రియను చూసి రవ్వంత ఆశ్చర్యపోయింది ధనలక్ష్మి.

"క్యారెట్ తీసుకోండమ్మా తాజాగా ఉన్నాయి." బుట్టలోంచి తీసి చూపిస్తూ చెప్పింది ధనలక్ష్మి. హరిప్రియ తీసుకోలేదు.

"బెండకాయలు చూపించు." అన్నది. ధనలక్ష్మి మరింత ఆశ్చర్యపోతూ "అయ్యగారికి క్యారెట్ కూరలంటే ఇష్టంకదా! ఒకసారి మీరే చెప్పారు.." హరిప్రియ ముఖాన్ని పరిశీలనగా చూస్తూ అడిగింది. ఆ మాటతో హరిప్రియ ముఖం ఎర్రటి క్యారెట్ దుంపలా మారిపోయింది.

"అంటే! ఆయనకేది ఇష్టమైతే అదే తిని బ్రతకాలా! మన ఇష్టాయిష్టాల గురించి పట్టించుకుంటున్నారా!" ఆవేశం తన్నుకురాగా అనేసింది. ఆ తర్వాత గబుక్కున 'కూరలమ్మే ధనలక్ష్మి దగ్గర బైటపడిపోయానే" మధనపడుతూ.

"సర్లె ఇవన్నీ నీకెందుకు.. నీకెలాంటి బాధలుండవుగా!" తిరిగి యథా స్థితికి వస్తూ విషయాన్ని మార్చేసింది హరిప్రియ. అప్పటికప్పుడే ధనలక్ష్మి మనసులో కొత్తకొత్త ఆలోచన్లు మొలకెత్తాయి. తన కూరల బేరం చూసుకుని "వస్తానమ్మా!"అంటూ నర్మగర్భితంగా నవ్వుతూ వెళ్ళిపోయింది ధనలక్ష్మి.

* * *

చాలారోజుల తర్వాత ధనలక్ష్మి బుగ్గలు పండిన టమోటా రంగులోకి మారిపోయాయి. సరైన సమయం రాక... ఆసక్తిలేక అలంకరణ వదిలేసిన ఆమె ఒక మోస్తరు అందగత్తే. క్యారెట్ దుంపలాంటి పొడవైన ముక్కు. దానికో వైపున తళుక్కున మెరిసే ముక్కుపుడక.

సాయంత్రం అయ్యేసరికి చక్కగా నూనె రాసుకుని, బిర్రుగా జడ అల్లుకుని మైసూర్ శాండిల్ సోప్‌తో ఒకటికి రెండుసార్లు ఒళ్ళు రుద్దుకుని మరీ స్నానం చేసింది. కాస్త ఖరీదైన చీర కట్టుకుని పువ్వుల జాకెట్ వేసుకుంది. తనకిష్టమైన మల్లెపూలు మూడుమూరల దండ నిండుగా జడలో పెట్టుకుని రాంసుందర్ రాక కోసం ఎదురుచూడసాగింది.

ఆమె నిరీక్షణ ఫలించింది. అనుకున్న సమయానికే హడావుడిగా వచ్చాడు రాంసుందర్. వచ్చీరావడంతోనే ...ధనలక్ష్మీ... మొత్తం రెండు నెలల వడ్డీ ఇవ్వాలి. వడ్డీయే ఇస్తావా? అసలు కూడా ఇస్తావా?" అడిగాడు.

"అసలు... వడ్డీ... రెండూ ఇస్తాను బాబూ... అందుకేగా ఈవేళ ఇంటికి రమ్మన్నది!" అంటూ వెళ్ళి తలుపేసింది ధనలక్ష్మి. ఆమె మాటలకు చేతలకు ఆశ్చర్యపోతూ "టైమ్‌లేదు. వెళ్ళాలి. త్వరగా ఇస్తే..." అన్నాడు.

"అలాగే..." అంటూ రాంసుందర్ ముందుకు వచ్చి, రెండు చేతులూ ప్రేమగా అతని భుజాలపైన వేసింది.

"ధనలక్ష్మీ! ఏమిటిది?" విస్మయంగా అడిగాడు.

"బాకీ తీర్చేస్తాను. అసలూ...వడ్డీ మొత్తం తీసుకోండి" మత్తుగా పలికింది. విషయం అప్పటికి పూర్తిగా అర్థమైన రాంసుందర్‌కి ఒళ్ళు జలదరించింది. ఆమెపట్ల ఏహ్యభావం పెల్లుబికింది. రెండు చేతుల్నీ విదిలించి కొట్టాడు.

"నేను వడ్డీ వ్యాపారం చేస్తాను. కానీ! ఆ వంకతో మరే వ్యవహారం చెయ్యను." కోపంగా చెప్పాడు. కొంచెం విస్తుపోయింది. తిరిగి మామూలుగా అయిపోయి.

"మీ ముఖం చూస్తేనే తెలిసిపోతున్నది.. మీరు మొఖం వాచిపోయారని. నాకంతా తెలుసు. రండి! ఇద్దరం స్వర్గంలో విహరిద్దాం..." తన్మయత్వంతో చెప్పుకుపోతున్నది.

"ఛీ... ఆపు... నీ మాటలు... ఇలాంటి చెత్త వ్యవహారాలు నాకు నచ్చవు. నా జీవితంలో... కలలో కూడా మరో స్త్రీకి అవకాశం లేదు. నన్నూ... నా ప్రియను ఈ జన్మలోనే కాదు ఏ జన్మలోనూ ఎవరూ వేరు చేయలేరు. అయినా భర్తా... పిల్లలున్న నువ్విలా సిగ్గువిడిచి ప్రవర్తించడం పద్ధతికాదు. చూడు ధనలక్ష్మీ! మంచిచెడులు... వావి వరుసలు పాటిస్తున్నాము కాబట్టే మనం మనుషులం. అలా లేనప్పుడు మనకీ...జంతువులకీ తేడా వుండదు. క్షమించు.. నీలో ఆశ కల్పించినందుకు." అని చెప్పి అక్కడ్నుండి చక... చకా వెళ్ళిపోయాడు రాంసుందర్.

* * *

"ఆఖరికి మీరింత దిగజారుతారని అనుకోలేదు..." కోపంగా అడిగింది హరిప్రియ. ఏ విషయంలో అంటున్నదో అర్థంకాక నివ్వెరపోయాడు రాంసుందర్.

"ఇన్నాళ్ళూ మీరెంతో మంచివాళ్ళూ... సంస్కారవంతులు అనుకున్నాను..." మరింత రెచ్చిపోయింది హరిప్రియ. అంతకుముందే కూరగాయల ధనలక్ష్మి వెంట వెళ్ళి దూరంగా వుండి తన భర్త రాంసుందర్ ఒక ఇంట్లోనుండి హడావుడిగా రావడం కళ్ళారా చూసింది. 'ఆ ఇంట్లో ఒకమ్మాయిని పెట్టుకుని మీ ఆయన భాగోతం సాగిస్తున్నాడని!' చెప్పిన ధనలక్ష్మి మాటలు చెవుల్లో పదే...పదే ధ్వనిస్తున్నాయి. అలిగి ఏదో కొన్ని రోజులు భర్తను దూరంగా పెట్టింది కానీ! భర్త ఇలా దూరమవుతాడని ఊహించలేకపోయింది.

ఇదంతా ఏమిటో అర్థంగాని రాంసుందర్ కొంత గందరగోళానికి గురయ్యాడు. హరిప్రియ ఏదో అనవసరంగా ఊహించుకుంటున్నదని నిర్ణయించుకున్నాడు.

"ఏమిటిలా అర్థంపర్థంలేని మాటలు విసరుతున్నావే?" అంటూ కేజువల్‌గా ప్రశ్నించాడు.

"అవును నా మాటలు అర్థంపర్థం లేనివే! మరి తమరి చేష్టలు అర్థం ఉండేవేనన్నమాట." విసురుగా అన్నది.

"వ్యంగ్యం ఎందుకు? అసలు విషయం ఏమిటో! సూటిగా అడుగు" విసుగ్గా అన్నాడు.

"సరే! సూటిగానే అడుగుతున్నాను. మన వీధి చివరి మలుపులో ఉన్న పెంకుటిల్లు వెనుక ఎవరున్నారు?" అడిగింది.

"అదా విషయం అక్కడ పెంకుటిల్లు వెనుక వున్న చిన్న రేకుల షెడ్డులో ఓ ఖాతా వుంటే డబ్బులు వసూలుకు వెళ్ళి వస్తుంటాను.." తేలిగ్గా చెప్పాడు.

"ఆహా ఎంత తేలిగ్గా చెప్పారండి! అక్కడెవరో ఒకదాన్ని పెట్టి సరదాగా.. రోజూ వెళ్ళి వస్తున్నారన్న మాట."

"ఇక ఆపుతావా!"

"ఆపను. మీ బండారం బైటపడింది. ఎవతె అది?" కళ్ళల్లో నిప్పులు కురిపిస్తూ అడిగింది హరిప్రియ.

"ప్రియ! పొరపడుతున్నావ్! ఆ షెడ్డులో ఉంటున్న వాళ్ళు డైలీ డబ్బులు కడుతుంటారు. బాకీ తీరగానే కొంత వడ్డీపోను మళ్ళీ కొంత మొత్తం డబ్బు తీసుకుంటుంటారు. చాలా మంచివాళ్ళు. అందుకే ఆ తల్లీ కూతుళ్ళిద్దరికీ చాలా తక్కువ వడ్డీకి డబ్బు ఇస్తుంటాను." చెప్పాడు రాంసుందర్.

"ఇదంతా కట్టుకథ. ధనలక్ష్మి అంతా చెప్పింది. మీరక్కడ ఎవతెనో పెట్టారు.." చెప్పింది. హరిప్రియ.

ధనలక్ష్మి మాట వచ్చేసరికి రాంసుందర్‌కి విషయం అర్థమైంది. అగ్గి రాజేసింది ఆమేనని. రెండడుగులు ముందుకువేసి భార్య హరిప్రియ చేయి పట్టుకుని చెప్పాడు. "సరే! నాతోరా!" అంటూ. హరిప్రియ మరో మాట మాట్లాడకుండా భర్త వెంట నడిచింది.

కొద్ది నిముషాల్లో ఇద్దరూ వీధి మలుపులో వున్న పెంకుటిల్లు వెనుకవున్న రేకుల షెడ్డుదగ్గరికి వెళ్ళారు. రాంసుందర్ తలుపుకొట్టాడు. ఓ ముసలమ్మ వచ్చి తలుపుతీసి అతన్ని చూస్తూనే "రా బాబూ..."అంటూ లోనికి ఆహ్వానించింది. రాంసుందర్.. హరిప్రియ ఇద్దరూ ఆ చిన్న రేకుల ఇంట్లోకి నడిచారు.

"రండి అన్నయ్యా!" అంటూ అక్కడ ఓ అమ్మాయి ప్లెయిన్ శారీస్ పైన చాలా అందంగా డిజైన్లు పెయింట్ చేస్తూ కనిపించింది.

"అమ్మా సౌజన్యా! నా భార్య హరిప్రియ.." అంటూ పరిచయం చేశాడు రాంసుందర్.

"ఓష్ వదినా! కూర్చోండి వదినా..." అక్కడున్న చిన్న మంచం చూపించిందా అమ్మాయి. ఆ పిల్ల కళ్ళల్లో ఆత్మీయతాభావం కోటి కాంతులుగా కన్పిస్తున్నది.

"అమ్మా.. టీ పెట్టు.." చెప్పింది సౌజన్య.

"ఇప్పుడవేం వద్దు సౌజన్య. మరోసారి వచ్చినప్పుడు తీసుకుంటాం. రేపు మీ వదినె కూడా శారీస్ పంపిస్తుంది మంచి డిజైన్స్ పెయింట్ చెయ్యాలి.." చెప్పాడు రాంసుందర్.

"ఓ తప్పకుండా అన్నయ్యా..."అంటూ ఆ అమ్మాయి ఆ ప్రక్కనే వున్న చేతి కర్రసాయంతో లేచి నిలుచుంది. అప్పుడు చూసింది హరిప్రియ ఆ పిల్ల ఒక కాలు చాలా సన్నగా... చచ్చుపడిపోయి వేలాడుతున్నది. ఒక్కసారిగా ఉలిక్కిపడింది.

"నీ కాలు...?"అంటూ అడిగింది.

"చిన్నప్పుడే పోలియో వచ్చి ఇలా అయిపోయింది వదినా. మా అన్నయ్య ఈమధ్యనే యాక్సిడెంట్‌లో చనిపోయాడు. రాంసుందర్ అన్నయ్య ఆదరణతోనే ఈమధ్యనే ఇక్కడికి వచ్చాం. నాన్న లేడు. అమ్మా... నేనూ... అన్నయ్య చేసిన డబ్బు సహాయంతో నేను పెయింటింగ్ వర్క్స్ నేర్చుకుని ఇప్పుడు నేనే వర్క్ చేయగలుగుతున్నాను. నిజంగా అన్నయ్య మాకు దేవుడు..." అంటూ నీళ్ళు నిండిన కళ్ళతో చెప్పలేకపోయింది సౌజన్య.

ఆ అమ్మాయి దగ్గరికొచ్చి తల మీద చేయివేసి ఆప్యాయంగా నిమురుతూ తన కళ్ళల్లో సుడులు తిరిగే నీళ్ళని కనిపించకుండా చేసింది హరిప్రియ. కొద్దిసేపు అక్కడ వుండి తిరిగి వచ్చేశారు. భర్త వైపు చూడలేకపోయింది హరిప్రియ.

* * *

చాలారోజుల తర్వాత హరిప్రియ కింద చాపేసుకుని పడుకోకుండా బెడ్ మీద అలంకరించుకుని పడుకుని వుండటం చూసి గదిలోకి అడుగుపెట్టిన రాంసుందర్ ఆశ్చర్యపోయాడు. తనే భర్తను అల్లుకుపోతూ "సారీ అండీ మీ గురించి అపోహపడ్డాను. ఆ ధనలక్ష్మి మరీ దుర్మార్గంగా చెప్పింది." అన్నది. అతను చిన్నగా నవ్వాడు. "ధనలక్ష్మి లాంటి వాళ్ళవల్లే సొసైటీలో కాపురాలు కూలుతుంటాయి. అయినా ఇకపై వడ్డీ వ్యాపారం మానేస్తాను" చెప్పాడు.

"వద్దు. చెయ్యండి. మనుషులకు గౌరవం తెచ్చేది వారి బుద్ధులుగానీ వృత్తులు కాదు. అయినా మీ వృత్తిలో కూడా మీరు ధర్మాన్నే పాటిస్తున్నారు. అందుకే... నేనివ్వాల్సింది కూడా ఇచ్చేస్తాను. భార్యగా ఇది నా ధర్మం..." చెప్పి సిగ్గుపడింది.

'అసలంతా ఇచ్చేస్తావా?" అడిగాడు.

"అసలు..వడ్డీ... కూడా! ఎందుకంటే మీకు అసలు కంటే వడ్డీ ముద్దు కదా?" పెనవేసుకుపోతూ అన్నది.

"అవును వడ్డీయే ముద్దు..." హరిప్రియ గాఢంగా చుంబిస్తూ చెప్పాడు తృప్తినిండిన మనసుతో రాంసుందర్.

*

**రచయిత చిరునామా:**
**పి.వి.రమణకుమార్,**
పొన్నంవారి వీధి,
కె.బి.రోడ్,
చిలకలూరిపేట- 522616.